క్లుప్తంగా

నిధులు మంజూరు చేయాలి



గడా అధికారికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లోని కస్తూర్భాగాంధీ బాలికల పాఠశాల, ఆదర్శ పాఠశాలల చుట్టూ ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సోమవారం ఎంపీపీ బాలేషంగౌడ్, ఎంపీటీసీ కవితశ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ మల్లేశంలు గడా అధికారి ముత్యంరెడ్డికి వినతిపత్రం అందించారు. గడా అధికారి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

'తండాల అభివృద్ధిపై చిన్నచూపు తగదు'

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని చాపగానీతండా గ్రామ పంచాయతీ పరిధిలోని ఫన్యానాయక్ తండా, ఇప్పల తండా, శ్రీరామ కాలనీ తండాలకు బీటీరోడ్లు నిర్మాణం కలేనా అని కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మాలోతు శ్రీనివాస్‌నాయక్ అన్నారు. సోమవారం తండాలో పలువురితో కలిసి విలేకరులతో మాట్లాడారు. కొన్ని సంవత్సరాలుగా తండాలకు సరైన రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులకు గురవుతున్నారని, చిన్నపాటి వర్షం పడితే చాలు తండాల ప్రజలు బయటకు వెళ్లేందుకు వీలులేని దుస్థితిలో రోడ్లు బురదమయంగా మారుతున్నాయన్నారు. ఈ విషయంపై పలుమార్లు ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధే తండాలో కనిపిస్తుందన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీలో కాంగ్రెస్ అధికారంలో రానున్నట్లు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాల ఊరేగింపులో భక్తులు

తొగుట(దుబ్బాక): మండలంలో రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు రెండోరోజు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉదయం పుట్టకు ధని పోయుట, పుట్ట బంగారం తీసుకురావడం, ఎరుక బుట్ట, నజర్ బోనం తీయడం, ఏడు అంతరాల బోనం తీయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మకు బోనాలు తీశారు.

క్రీడాకారులకు స్పోర్ట్స్‌డ్రెస్‌ల అందజేత



టీషర్టులు అందిస్తున్న సర్పంచ్ స్వామి

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని రసులాబాద్ గ్రామంలో నిర్వహించిన మండల స్థాయి సీఎం కప్ ఆటల పోటీల్లో గెలుపొంది జిల్లాస్థాయికి ఎంపికైన క్రీడాకారులకు రసులాబాద్ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామి సోమవారం స్పోర్ట్స్ డ్రెస్‌లు అందజేశారు. కార్యక్రమంలో పీఈటీ రాము, క్రీడాకారులు రజనీకాంత్, ప్రవీణ్, పాషా తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

హుస్నాబాద్: 2023–24 సంవత్సరానికి గాను మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినీ, విద్యార్థులు ఈ నెల 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని హుస్నాబాద్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అన్నపూర్ణ సోమవారం తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సుల్లో ఒక్కో గ్రూపుల్లో 40 సీట్ల చొప్పున అవకాశం ఉందన్నారు. విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం ఉందన్నారు. పాఠశాలలో చేరే విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలు ఉచితంగా అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత



డిపాజిట్ పత్రాలు అందిస్తున్న మిత్రులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ఆకునూరుకు చెందిన మంతపురి రాజు ఇటీవల మృతి చెందాడు. మృతుడి చిన్ననాటి మిత్రులు 1998–99లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా వారందరూ కలిసి జమచేసిన రూ.1.20లక్షలు మృతుడి కుమార్తె శరణ్య పేరుతో పోస్ట్ ఆఫీస్‌లో డిపాజిట్ చేసి డిపాజిట్ పత్రాలు అందించారు. తమతో కలిసి చదువుకున్న తోటిమిత్రుడి కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలనే ఉద్దేశంతో మిత్రులంతా కలిసి చేసిన సాయాన్ని గ్రామస్తులు అభినందించారు.

ఆగుతూ.. సాగుతూ..



అసంపూర్తిగా కేజీబీవీ భవన నిర్మాణం

- అసంపూర్తిగా కేజీబీవీ భవనం
- ఏడాదిన్నర కావొస్తున్న పూర్తి కాని పనులు
- అద్దె భవనంలో కొనసాగుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలో నిర్మిస్తున్న కేజీబీవీ భవన నిర్మాణ పనులు నత్తతో పోటీపడుతున్నాయి. భవన నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.3.20కోట్లు మంజూరవగా ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ చేతుల మీదుగా శంకుస్థాపన చేసి దాదాపు ఏడాదిన్నర కావొస్తున్న పనులు ఇంకా పూర్తికాలేదు. నిర్మాణ పనులు ఆగుతూ.. సాగుతూ ఉండడంతో నత్తే నయం అన్నట్లుగా మండలంలో పలువురు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం గ్రౌండ్ ఫ్లోర్, రెండో అంతస్తు పనులు అసంపూర్తిగా ఉండగా, మూడో అంతస్తు పనులు నిలిచిపోయాయి. ఇదేమిటనీ భవన నిర్మాణ కాంట్రాక్టర్‌ను పలువురు ప్రశ్నించగా 'చేసిన పనులకు బిల్లులు రావట్లేదని, బిల్లులు వస్తే పనులు చేపడతామని చెబుతున్నాడు. ఈ నేపథ్యంలో శంకుస్థాపన చేసిన సమయంలో స్థానిక ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ సదరు కాంట్రాక్టర్‌ను 9 నెలలు భవన నిర్మాణ పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. కానీ ఏడాదిన్నర దాటుతున్న పనులు పూర్తి కాకపోవడం విశేషం.

అద్దె భవనంలో కొనసాగింపు

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో 2019లో ఓ ప్రైవేట్ అద్దె ఇంట్లో కేజీబీవీ బాలికల పాఠశాలను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ప్రస్తుతం వరకు అంటే దాదాపు నాలుగేళ్ల కావొస్తున్న అద్దె ఇంట్లో అరకొర వసతుల మధ్య నెట్టుకొస్తున్నారు. సరైన మరుగుదొడ్లు, ఇతర వసతులు లేకపోయిన కాలం వెల్లదీస్తున్నారు. ఐదు గదులకు నెలకు 40వేల అద్దెను చెల్లిస్తున్నారు. ప్రస్తుతం 10వ తరగతి వరకు మొత్తం 137 విద్యార్థులు ఉన్నారు. అదేవిధంగా ఈసారి మండల స్థాయిలో పదో తరగతిలో వందశాతం ఉత్తర్ణీతను సాధించడమే కాకుండా మండల ప్రథమ టాపర్‌గా నిలిచారు. దీంతో ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య ఎక్కువగా పెరిగే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి. విద్యార్థుల సంఖ్య పెరిగితే వసతుల కల్పన కష్టంగా ఉంటుందని, పలుమార్లు సదరు కేజీబీవీ కాంట్రాక్టర్‌కు త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని కేజీబీవీ ఎస్‌ఓ సరిత కోరారు. ఇకనైనా జిల్లా కలెక్టర్ దృష్టి సారించి దసరా వరకు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

- ఎమ్మెల్సీ యాదవరెడ్డి,
- ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

ములుగు(గజ్వేల్): అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలు పేర్కొన్నారు. ములుగు మండలం సింగన్నగూడ గ్రామంలో రూ.22లక్షల వ్యయంతో చేపట్టనున్న పద్మశాలి సంఘం భవనం, కొక్కొండలో రూ.20 లక్షలతో నిర్మించనున్న గౌడ సంక్షేమ సంఘం భవనం, రూ.20లక్షల నిధులతో చేపట్టనున్న పద్మశాలి సంఘం భవన నిర్మాణాలకు సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ చేనేత, నేత వృత్తిలో కొనసాగుతున్న వారికి అవసరమైన చేయూత, ప్రోత్సాహం అందించడంతో పాటు గీత కార్మికుల కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జహంగీర్, పీఏసీఎస్ చైర్మన్ అంజిరెడ్డి, జెడ్పీటీసీ జయమ్మఅర్జున్‌గౌడ్, ఎంపీపీ లావణ్యజున్‌గౌడ్, వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, అఖిల భారత పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి సుధాకర్, సర్పంచ్‌లు బాలకృష్ణ, బంగ్ల గణేశ్, ఉపసర్పంచ్ స్వామిగౌడ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర యువజన కార్యదర్శి జుబేరపాషా, నాయకులు నాగరాజు, సురేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణే లక్ష్యం



తిప్పారంలో అద్దాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి



చిన్నకోదూరు(సిద్దిపేట): శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కొండపాక(గజ్వేల్): అంధత్వ నివారణే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమం చేపట్టారని ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి పేర్కొన్నారు. కుకునూరుపల్లి మండలంలోని తిప్పారం గ్రామంలో రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్, సర్పంచ్ లక్ష్మిలతో కలిసి సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొండల్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కో–ఆర్డినేటర్ ర్యాగల్ల దుర్గయ్య, సర్పంచ్‌లు పుల్లోజు కిరణ్‌కుమార్, బచ్చలి మహిపాల్, ఆత్మ కమిటీ డైరెక్టర్ లగిశెట్టి కనకయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు కోరె చరణ్, నాయకులు కిష్టారెడ్డి, కర్ణాకర్, రమేశ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మమత తదితరులు పాల్గొన్నారు.

చిన్నకోదూరు(సిద్దిపేట): మండల పరిధిలోని ఎల్లాయపల్లిలో కంటి వెలుగు శిబిరం, స్టీల్ బ్యాంక్‌ను ఎంపీపీ ఉపాధ్యక్షుడు కీసరి పాపయ్య, రైతుబంధు జిల్లా డైరెక్టర్ వెంకటేశంలు ప్రారంభించారు. కంటి వెలుగుతో ఎంతో మంది పేదలకు కంటి సమస్యలు తొలిగిపోయాయన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. వాటితో కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేందర్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ సోమిరెడ్డి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండలంలోని కూటిగల్ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ దొమ్మ బాలమణి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రేణుక, పంచాయతీ కార్యదర్శి అనిత, వార్డు సభ్యులు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

కూడవెల్లిలో..

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని కూడవెల్లిలో కంటి వెలుగు శిబిరం ఎంపీపీ గజ్జెల సాయిలు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ ఎండీ.అహ్మద్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు సూకూరి లింగం, సర్పంచ్ సుగుణ, భూంపల్లి పీహెచ్‌సీ వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువ మత్స్యకారులకు సభ్యత్వం ఇవ్వాలి

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వం మత్స్య సహకార సంఘాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇచ్చి 18 ఏళ్ల యువతకు సంఘంలో సభ్యత్వాలు ఇవ్వాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ పిట్టల రవీందర్‌కు విజ్ఞప్తి చేసినట్లు సంఘం నాయకుడు పెండ్యాల అయిలయ్య తెలిపారు. సోమవారం సమాఖ్య చైర్మన్‌గా పిట్టల రవీందర్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హుస్నాబాద్ మత్స్యకార సంఘం నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, చైర్మన్ పిట్టల రవీందర్‌లను కలిసి గ్రామీణ ప్రాంతాల మత్స్యకారుల సమస్యలను వివరించారు. ఎలాంటి నిబంధనలు లేకుండానే యువతకు సహకార సంఘాల్లో సభ్యత్వం ఇచ్చి స్వయం ఉపాధి కోసం సబ్సిడీపై వాహనాలను, ద్విచక్ర వాహనాలను అందించాలని కోరినట్లు చెప్పారు. వీరి వెంట ముదిరాజ్ సంఘం నాయకుడు పొన్నపోయిన శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

గజ్వేల్‌రూరల్: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు కౌన్సిలర్ గంగిశెట్టి చందనరవీందర్ పేర్కొన్నారు. సోమవారం వార్డు పరిధిలో రూ.8లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తున్న సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు కుమార్ తదితరులున్నారు.

రోగులకు ఇబ్బంది లేకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ

దుబ్బాకరూరల్: మండలంలోని రామక్కపేట, తిమ్మాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధిపై సోమవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ కొత్త పుష్పలత అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఆస్పత్రుల అభివృద్ధి, ఆస్పత్రికి వచ్చే నిధులపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదన్నారు. ఆస్పత్రి అభివృద్ధి కోసం ప్రభుత్వం అందించే నిధులు వృథాగా ఖర్చు చేయకూడదని, వాటిని ఆస్పత్రి అభివృద్ధి కోసమే వాడాలన్నారు. ఎవరైన అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కరశర్మ, మెడికల్ ఆఫీసర్లు హిమబిందూ, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠోత్సవాలు

మర్కూక్(గజ్వేల్): మండలంలోని నర్సన్నపేట గ్రామంలో సోమవారం బొడ్రాయి ప్రతిష్ఠోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జెడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం దంపతులు, సర్పంచ్ మాధవి రాజిరెడ్డి దంపతులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. హోమం నిర్వహించారు. మూడురోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు మాధవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహరెడ్డి, మహిపాల్‌రెడ్డి, జశ్వంత్‌రెడ్డి, స్వామి, గణేశ్, పర్వతాలు, కృష్ణ, కనకయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

భాగ్యరెడ్డివర్మను ఆదర్శంగా తీసుకోవాలి



దుబ్బాకటౌన్: చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ వనిత తదితరులు



బెజ్జంకి(సిద్దిపేట): చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

దుబ్బాకటౌన్: అభ్యుదయవాది భాగ్యరెడ్డివర్మ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకుసాగాలని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి అన్నారు. సోమవారం భాగ్యరెడ్డివర్మ 135వ జయంతిని మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలకు విద్య ఎంతో అవసరమని గుర్తించి మొట్టమొదటగా తన సొంత నిధులతో విద్యా సంస్థలు స్థాపించి ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ మహిళలు చదువుకునేలా ప్రోత్సహించిన గొప్ప వ్యక్తి భాగ్యరెడ్డివర్మ అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆసయాదగిరి, దేవుని లలిత చంద్రయ్య, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో బెజ్జంకిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బొనగిరి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు దీటి బాలనర్సు, స్వేరోస్ జిల్లా కో–ఆర్డినేటర్ ఉప్పలేటి బాబు, బొర్ర సురేశ్, వడ్లూరు పరశురాములు, జంగిటి శంకర్, లింగాల శ్రీనివాస్, అనిల్, మహేశ్, యాదగిరి, సంపత్ పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: పట్టణంలో దళిత, ప్రజాసంఘాల నాయకులు భాగ్యరెడ్డివర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర యువజన కార్యదర్శి నీరుడి స్వామి, తెలంగాణ అంబేడ్కర్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చిప్పల యాదగిరి, అభినవ అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్, నాయకులు సురేశ్, స్వామి పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి



పెద్దకోదూరులో ధాన్యం కొనుగోలును పరిశీలిస్తున్న దృశ్యం

చిన్నకోదూరు(సిద్దిపేట): మండల పరిధిలోని పెద్దకోదూరు, రామంచ, చిన్నకోదూరు, గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఏపీఎం మహిపాల్ సందర్శించారు. రైతులు, నిర్వాహకుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాలకు తడవకుండా ధాన్యంపై కవర్లు కప్పి ఉంచాలన్నారు. తూకం వేసిన ధాన్యం వెంటనే మిల్లులకు పంపేలా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. ఇప్పటివరకు 13 ఐకేపీ కేంద్రాల ద్వారా 1,081 మంది రైతుల నుంచి 151 లారీల ధాన్యం విక్రయించినట్లు చెప్పారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దని సూచించారు. ఆయన వెంట సర్పంచ్ ఉమేశ్‌చంద్ర, సీసీలు శ్రీనివాస్‌రెడ్డి, కొమురయ్య, వీఓఏలు, రైతులు పాల్గొన్నారు.

హుస్నాబాద్: రైతులకు ఇబ్బంది కలగకుండా వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ డిమాండ్ చేశాడు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సీపీఐ రైతు, మహిళా, యువజన సంఘాలతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి సకాలంలో కొనుగోళ్లు చేయాలన్నారు. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి కొనుగోలు విషయంలో చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు అయిలేని సంజీవరెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, నాయకులు స్వాతి, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పోస్ట్ కార్డుల ద్వారా విజ్ఞప్తి

సిద్దిపేటకమాన్: ఉపాధ్యాయ బదిలీల్లో స్పౌజ్ పాయింట్లు తొలగించాలని జిల్లా నాన్ స్పౌజ్ టీచర్ల ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డిలకు పోస్ట్‌కార్డుల ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భార్యాభర్తలు ఇద్దరినీ ఒకేచోట ఉంచాలనుకున్నప్పుడు స్పౌజ్ పాయింట్లు అవసరం లేదన్నారు. పోస్ట్ కార్డు ద్వారా వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాన్ స్పౌజ్ టీచర్స్ పాల్గొన్నారు.

◆ రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

గజ్వేల్‌రూరల్: ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని గజ్వేల్ మండల బీజేపీ అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మరో నాలుగైదు రోజుల్లో రోహిణీ కార్తె సమీపిస్తుందని, ఆ సమయంలో రైతులు ఇబ్బందులు పడే అవకాశముందన్నారు. వరి ధాన్యాన్ని వెంటనే తూకం వేయాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవడంతో పాటు వెంటనే కొనుగోళ్లు జరిపి గిట్టుబాటు ధర అందించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ అసెంబ్లీ కో–కన్వీనర్ బండారు మహేశ్, నాయకులు రాజు, బాలయ్య, బీజేవైఎం నాయకులు స్వామి, కుమార్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ పరామర్శ

దుబ్బాక: దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త సోమన్నగారి లక్ష్మయ్య కుమారుడు యాదగిరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో విషయం తెలుసుకున్న దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు కత్తి కార్తీకగౌడ్ సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రావు, కొత్త దేవిరెడ్డి, భూపాల్‌గౌడ్, నర్సింలు, సుధాకర్, ఆంజనేయులు తదితరులున్నారు. అదేవిధంగా మండల పరిధిలోని ఇందూప్రియాల్ గ్రామానికి చెందిన పోతురాజు వెంకటేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు.

◆ నిధుల దుర్వినియోగంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

చిన్నకోదూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మైలారం గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై గ్రామస్తుడు ఇరుమళ్ల ఎల్లయ్య సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సర్పంచ్ కాల్వ ఎల్లయ్య పంచాయతీ నిధులు సొంత ఖాతాలోకి బదిలీ చేసుకున్నాడని, సమాచార హక్కు చట్టం ద్వారా బయటపడిందని బాధితుడు తెలిపారు. కాగా సర్పంచ్ కాల్వ ఎల్లయ్య తనపై ఫిర్యాదు చేసిన వినతిని తిరిగి తీసుకోవాలని బెదిరింపులకు పాల్పడుతున్నాడని వాపోయాడు. కాగా బాధితునికి అండగా డీసీసీ కార్యదర్శి మీసం నాగరాజు, నాయకులు మహేందర్ తదితరులు అండగా నిలిచి, ఈ విషయమై పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

◆ జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలి

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండల కేంద్రంలో కస్తూర్బా జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలని వర్గల్ జెడ్పీటీసీ బాలుయాదవ్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన జిల్లా విద్యాధికారిని కలిసి వినతి పత్రం అందజేశారు. కాలేజీ ఏర్పాటు కోసం అవసరమైన భవనం అందుబాటులో ఉందన్నారు. తమ వినతిపై డీఈఓ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ లతరమేశ్‌గౌడ్, బీసీ సెల్ నాయకుడు మురళీగౌడ్ ఉన్నారు.

స్వచ్ఛ పట్టణానికి ప్రజలు సహకరించాలి



వీధులను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణాన్ని చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని 4, 16వ వార్డుల్లో సోమవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం, ట్రిపుల్ ఆర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ శానిటేషన్ సిబ్బందితో వీధులు, మురికి కాల్వలను శుభ్రం చేసి రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ఇంటి నుంచి వెలువడే పొడి, తడి చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు అందించాలన్నారు. అదేవిధంగా ఇంటిలో నిరుపయోగంగా ఉన్న పాత వస్తువులు, పుస్తకాలు, ప్లాస్టిక్ వస్తువులను ట్రిపుల్ ఆర్ సెంటర్‌కు అందించి ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ జనగామ రత్నమాల, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం



నంగునూరులో కొట్టుకుపోయిన ధాన్యం



చేర్యాలలో తడిసిన ధాన్యం బస్తాలు



పెద్దకోదూరు రోడ్డుపై పడిన వృక్షం

నంగునూరు(సిద్దిపేట): మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసిన ధాన్యం తడిసిపోయింది. ఈదురుగాలులతో వడ్లపై కప్పిన కవర్లు లేచిపోయి వడ్లు కొట్టుకుపోయాయి. మామిడి కాయలు నేలరాలగా, కూరగాయ పంటలకు నష్టం వాటిల్లింది. నంగునూరుకు చెందిన గడబోయిన మల్లయ్య వ్యవసాయ బావి వద్ద పిడుగుపడడంతో లేగదూడ అక్కడికక్కడే మృతి చెందింది.

చిన్నకోదూరు(సిద్దిపేట): మండలంలో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. రైతులు ముందు జాగ్రత్తగా కవర్లు కప్పడంతో కొంత మేరకు ధాన్యం తడిసిపోయింది. అదేవిధంగా ఈదురు గాలులకు చిన్నకోదూరు రహదారిపై పెద్దకోదూరు శివారులో రోడ్డు పక్కన వృక్షాలు నేల కూలడంతో వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. సోమవారం వాటిని తొలగించడంతో వాహనాలు యాథావిధిగా తిరిగాయి.

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని మార్కెట్ యార్డులో ధాన్యం తడిసిపోయింది. ఇటీవల వడగండ్ల వానతో నష్టపోయిన రైతులు మిగిలిన కొద్దిపాటి ధాన్యాన్ని విక్రయించేందుకు తీసుకొచ్చి కాంటా వేసేందుకు సిద్ధమైన క్రమంలో తడిసిపోయాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యం తిరిగి ఆరబోయాలంటే కష్టం అవుతుందని, అదేవిధంగా కొనుగోలు చేయాలని కోరుతున్నారు.